క్లుప్తంగా

ఆడారి దృష్టికి ప్రజాసమస్యలు



62వ వార్డు ప్రజలతో ఆడారి ఆనంద్‌కుమార్

సింహాచలం: జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్‌కాలనీ, ఎస్సార్‌కాలనీ, గుడివాడఅప్పన్నకాలనీ, దుర్గానగర్, త్రినాథపురం, టీడీపీ కాలనీ, అంబేడ్కర్‌కాలనీ, ప్రకాష్‌నగర్, హరిజనవీధి, రెల్లివీధి, గాంధీవీధి తదితర ప్రాంతాల్లో ప్రజాసమస్యలను పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు తీసుకెళ్లారు. సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా డ్రైనేజీ, మంచినీటి సమస్యలు, వీధి దీపాల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆడారి ఆనంద్‌కుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ లక్ష్మణరావు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: పెరిగిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. 59వ వార్డు నక్కవానిపాలెం, శ్రీహరిపురం ప్రాంతాల్లో శుక్రవారం వారు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నక్కవానిపాలెంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు కాంట్రాక్టర్ సత్యానారాయణ మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీలతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుడాల రాంబాబు, గండి అప్పారావు, లక్ష్మి, జయ, గండి రవణమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ శుభ్రం



వాటర్ ట్యాంక్ లోపల శుభ్రం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింహాచలం: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం సిబ్బంది శుభ్రంగా శుభ్రం చేశారు. సమస్యను వార్డు కార్పొరేటర్ గండ్రపు నాగేశ్వరరావు వాటర్ సప్లై ఏఈ కరుణాకర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. వెంటనే జీవీఎంసీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లి శుభ్రపరిచారు. ట్యాంక్ పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలు తీసివేసి శుభ్రపరిచారు.

తోపుడుబండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్

మద్దిలపాలెం: చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. చిరు వ్యాపారులతో శుక్రవారం పిఠాపురం కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో హాకర్ల జోన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలన్నారు. జీవీఎంసీ అధికారులు నిబంధనలు చిరు వ్యాపారులపై దాడులు చేస్తూ జీవనోపాధికి భంగం కలిగిస్తున్నారన్నారు. వెంటనే హాకర్ల జోన్‌లు ఏర్పాటు చేస్తే ఈ సమస్య పునరావృతం కాదన్నారు. దీనిపై ఈనెల 20వ తేదీ నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. నవంబర్ 15న చలో జీవీఎంసీ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. సింహాచలం, పి.వెంకటరావు, రాజు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 91, 58 వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



రామకృష్ణానగర్‌లో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: పేదలకు అండగా ఉంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. 91వ వార్డు 483 సచివాలయం పరిధి రామకృష్ణానగర్‌లో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షులు... ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వారు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నివాసులను స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 400 గడపలకు వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న పాలనలో సచివాలయాల ద్వారా ప్రభుత్వమే ప్రజల చెంతకే వచ్చిందన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకమైన సేవలు అందుతున్నాయని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా అందిస్తున్న వైద్య సేవల గురించి వివరించారు. త్వరలో ఈ ప్రాంతంలో ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ జరుగుతుందన్నారు.అనంతరం 10 మందికి నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను ఆయన అందించారు. కార్యక్రమంలో పార్టీ 91వ వార్డు అధ్యక్షుడు గుణశెట్టి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, దేవెర్ల సత్యనారాయణరెడ్డి, ఈటపల్లి గోవింద, ఆళ్ల వీర్రాజు, నమ్మి వెంకటకృష్ణమూర్తి యాదవ్, తమ్మి రెడ్డి, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలకుడు సీఎం జగన్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్, కుంచమ్మ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ పథకాల బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల సుపరిపాలనలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలంతా ఒక్కసారి గమనించాలన్నారు. నిత్యం ప్రజా సంక్షేమం కోసం పరితపించే వైఎస్ జగన్‌ను మళ్లీ మీరంతా ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్లు చుక్క వరలక్ష్మి, తోరాణి వెంకటరమణి, పార్టీ వార్డు అధ్యక్షుడు కృష్ణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'బాక్సింగ్' బ్రదర్స్

అమ్మ ప్రోత్సాహం.. కోచ్‌ల సహకారం



పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం వేణుగోపాల్, పీఈటీ సత్యకళ

గోపాలపట్నం: ఆ చిన్నారుల ఆసక్తిని తల్లి ప్రోత్సహించింది. దానికి కోచ్‌ల సాయం తోడైంది. దాంతో ఆ విద్యార్థులు పలు బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపారు. తాజాగా నేపాల్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. దీంతో వారికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి

బుచ్చిరాజుపాలెం ఎస్సీ కాలనీలో ఉంటున్న సూర్యాసీ ముగ్గురు కొడుకులు. తండ్రి రెండేళ్ల క్రితం వదిలి పెట్టి ఎటో వెళ్లి పోయాడు. అప్పటి నుంచి టైలరింగ్ చేసుకుంటూ తల్లి సాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. కుమారులు షేక్ జబీర్, షేక్ ఆరీఫ్, షేక్ ఆసిఫ్ తమకు బాక్సింగ్‌పై ఆసక్తి ఉందని తల్లితో చెప్పారు. ముగ్గురూ అక్కయ్యపాలెం జీవీఎంసీ పాఠశాలలో బాక్సింగ్ నేర్చుకున్నారు. రెండేళ్ల కిందట గోపాలపట్నం హైస్కూల్‌కి మారారు. ఇక్కడి మైదానంలో బాక్సింగ్ నేర్పుతున్నట్లు తెలుసుకుని కోచ్‌లు కిరణ్‌కుమార్, ఎస్ఎస్ ప్రభాకర్‌ను కలిశారు. బాక్సింగ్‌పై ఉన్న ఆసక్తి, కుటుంబ నేపథ్యంలో చెప్పడంతో ఉచితంగా బాక్సింగ్ నేర్పించారు. ఆ కోచ్‌ల ప్రోత్సాహంతో పలు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో బంగారు, వెండి, కాంస్యపతకాలు సాధించారు.

తాజాగా నేపాల్‌లో విజేతలుగా..

ఇటీవల నేపాల్‌లో సాంప్రదాయ భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో షేక్ జబీర్, షేక్ ఆరీఫ్ బంగారు పతకాలు సాధించారు. షేక్ జబీర్ 66–67 కిలోల విభాగంలో, షేక్ ఆరీఫ్ 33–37 కిలోల విభాగంలో చాంపియన్లుగా నిలిచారు.

సత్కారం

పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, పీఈటీ సత్యకళ అభినందించారు. నేపాల్ గెలిచిన మెడల్స్ చూపించి అక్కడ పోటీలు జరిగిన తీరును వారు ఉపాధ్యాయులకు వివరించారు. ఉన్నతస్థాయికి ఎదిగి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ఢీకొట్టి వెళ్లిపోయిన కారు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మనోజ్‌కుమార్

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానికంగా ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న పంజాబ్ హోటల్ ప్రాంతానికి చెందిన బి. పుణ్యవతి(14), ఉర్వశి ప్రాంతానికి చెందిన మనోజ్ కుమార్(20) రోడ్డు దాటుతుండగా ఎన్ఏడీ నుంచి తాటిచెట్ల పాలెం వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డవారిలో బాలికను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, మనోజ్‌కుమార్‌ను 108లో కేజీహెచ్‌కు తరలించారు. అయితే ఎయిర్ పోర్టు పోలీసులకు కారు ఆచూకీ కోసం సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎయిర్‌పోర్టు పోలీసులు చెబుతున్నారు.

విద్యార్థి చదువుకు రూ.25 వేల సాయం



విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రియదర్శిని కాలనీ ప్రాంతానికి చెందిన వి.ప్రసన్న చదువు కోసం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ రూ.25 వేలు అందించి తన గొప్ప మనసు చాటుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రియదర్శిని కాలనీ ప్రాంతానికి వెళ్లిన ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కళాశాలకు వెళ్లడం లేదని తెలుసుకున్నారు. మంచిగా చదువుకోవాలని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఆ యువతి తల్లిదండ్రులకు శుక్రవారం నక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో రూ. 25 వేల చెక్‌ను అందించారు. కార్యక్రమంలో 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, వార్డు పార్టీ అధ్యక్షుడు జీవీఎస్ఎన్.రాజు (కేబుల్ వాసు), మూడు వార్డుల పార్టీ ఇన్‌చార్జి భోగవల్లి నాగభూషణం, నాయకులు బూస అప్పలరెడ్డి,సూకరెడ్డి,దట్టి సూకరాజుయాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణమయ్య జయంతి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీకాంత కృష్ణమాచార్య(కృష్ణమయ్య) జయంతిని ఘనంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానంలో కృష్ణమయ్యకు ఎంతో విశిష్టత ఉంది. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిపై వచన సంకీర్తనలను కృష్ణమయ్య రచించారు. అంతటి ఘన కీర్తిని గాంచిన కృష్ణమయ్య జయంతిని ఏటా భాద్రపద చతుర్థి నాడు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా ఆలయ బేడా మండపంలో ఉన్న కృష్ణమయ్య విగ్రహం చెంతన అర్చకులు జయంతి పూజలు నిర్వహించారు. కృష్ణమయ్య రచించిన వచన సంకీర్తనలను ఆలపించారు.

వైద్య సిబ్బందికి కిట్ల అందజేత



ఏఎన్ఎంలకు వైద్య పరీక్ష కిట్లు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంట్లో ఉన్న వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని.. అవసరమైన వైద్య పరీక్షలు చేయాలని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచించారు. తన సొంత నిధులతో సమకూర్చిన వైద్య పరీక్ష కిట్లను శుక్రవారం జీవీఎంసీ 59వ వార్డు ప్రాంత ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు ఆయన అందజేశారు. అంకిత భావంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు దేవర్ల సత్యనారాయణ, పశ్చిమ క్లస్టర్–2 అధ్యక్షులు అంగ రామ్‌ప్రసాద్,భోగవల్లి నాగభూషణం,భాస్ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారి ఆకస్మిక తనిఖీలు



జీవీఎంసీ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ

సింహాచలం: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలోని సచివాలయాన్ని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి డాక్టర్ రామకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. ముఖ్యమైన రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది సచివాలయంలోనే ఉండాలని, ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో జాప్యం చేయొద్దని ఆయన సూచించారు. అనంతరం అక్కడి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థుల వివరాలు, హాజరు పట్టీ, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఏకేసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పిల్లల హాజరును బట్టి రికార్డుల్లో వివరాలు నమోదు చేయాలని, ఎటువంటి తప్పు జరిగినా ఉపేక్షించేది లేదని సిబ్బందిని డాక్టర్ రామకృష్ణ హెచ్చరించారు.

శరన్నవరాత్రుల సందడి

- ముస్తాబైన ఆలయాలు
- రేపటి నుంచి ప్రత్యేక పూజలు



బుచ్చిరాజుపాలెంలోని దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయం



విద్యుత్ కాంతులు

విశాఖ విద్య: దేవీ నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలతో పాటు పలు ప్రాంతాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం శ్రీ దుర్గాలమ్మ–బంగారమ్మ ఆలయం, సోతేవుపురంలోని దుర్గాదేవి ఆలయం, లక్ష్మీనగర్–ఎన్ బ్లాక్‌లో గల విజయదుర్గమ్మ ఆలయం, 52వ వార్డు కరాస‌లోని దుర్గాలమ్మ ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆదివారం నుంచి ఈ నెల 24 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వేడుకగా జరిపించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. అదే విధంగా ఎన్ఏడీ కూడలిలోని పలు కాలనీల్లో మండపాలు ఏర్పాటు చేసి, దుర్గాదేవి విగ్రహాలను నెలకొల్పేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. శ్రీదేవి శరన్నవరాత్రులతో కాలనీల్లో దసరా సందడి అప్పుడే మొదలైంది.

ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని శ్రీ దుర్గాలమ్మ–శ్రీ బంగారమ్మ ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీదుర్గాలమ్మ–శ్రీ బంగారమ్మ అమ్మవార్లు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. ఉత్సవాల వేళ అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారని ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బుజ్జి, కార్యదర్శి జగన్, కుమార్, గోపి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

రోజుకో అవతారంలో..

ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ నెల 15న శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణాదేవిగా, 18న మహాలక్ష్మిగా, 19న లలితా త్రిపుర సుందరీదేవి, 20న సరస్వతీదేవిగా, 21న దుర్గాదేవి, 22న మహిషాసుర మర్దిని, 23న శ్రీ రాజరాజేశ్వరి దేవి అవతారంలో దర్శనమివ్వనున్నారు. 24న విజయదశమి రోజున నిజరూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

కాలనీల్లో జోష్

ఎన్ఏడీ కూడలితో పాటు పలు కాలనీల్లో దసరా ఉత్సవాల సందడి కనిపిస్తోంది. కాలనీల్లో మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారు. భారీ విద్యుత్ సెట్టింగ్‌లు, మండపాలు సిద్ధం చేస్తున్నారు. మరో వైపు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని పోలీసులు ఇప్పటికే విస్తృతంగా ప్రచారం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన ముందస్తు చర్యలు చేపట్టారు.

ఉక్కు కో–ఆపరేటివ్ బంక్‌లో వివాదం

- పెట్రోల్ నాణ్యతపై నిలదీసిన ఉద్యోగులు
- పరీక్షలతో సద్దుమణిగిన వైనం



బాటిల్‌లో నింపిన పెట్రోల్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కో–ఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంక్‌లోని పెట్రోల్‌పై శుక్రవారం వివాదం చెలరేగింది. పెట్రోల్‌లో నీళ్లు కలిపి నాణ్యత లేని పెట్రోల్ అమ్ముతున్నారని కొంతమంది ఉద్యోగులు చేసిన ఆరోపణలు ప్లాంట్ వాట్సాప్‌లో హల్‌చల్ చేయగా.. పాలకవర్గం ప్రతినిధులు రంగంలో దిగి వారి ఆరోపణలపై వివరణ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఒకరు ఉదయం బంక్‌కు వెళ్లి బాటిల్‌లో పెట్రోల్ కొట్టించగా పెట్రోల్ రంగు కొద్దిగా మారి ఉండటంతో నీళ్లు కలిపారని హడావుడి చేశారు. దానికి కొంతమంది మద్దతు ఇవ్వడంతో బంక్ సిబ్బందిని నిలదీశారు. రెండు రోజుల పాటు వర్షం పెట్రోల్ రంగు, రుచిలో కొద్దిపాటి తేడా ఉంటుందని హెచ్‌పీసీఎల్ అధికారులు తెలిపారని చెప్పారు. ఉద్యోగులు దానిని అంగీకరించక.. ఫిల్టర్ పేపర్‌తో తనిఖీ చేసి చూపాలంటూ డిమాండ్ చేశారు. సిబ్బంది ఫిల్టర్ పేపర్ తెచ్చి చూపినా ఉద్యోగులు శాంతించలేదు. ఈ విషయం తెలిసి కో–ఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు బి.టి. జగన్, డైరెక్టర్ నాగబాబు ఇద్దరూ హెచ్‌పీసీఎల్ అధికారులు పంపిన సమాచారాన్ని సభ్యులకు చూపించారు. నాణ్యత కలిగిన పెట్రోల్ సాంద్రత 700 పైగా ఉండాల్సి ఉండగా బంక్ పెట్రోల్ సాంద్రతను పరీక్షించగా 741.8 వచ్చింది. దీంతో ఉద్యోగులు శాంతించారు.

ఘనంగా 'నా దేశం–నా మట్టి'



రెస్టారెంట్‌లను ప్రారంభిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నా దేశం–నా మట్టి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ సేవా పథకం విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రారంభించారు. వర్సిటీ నుంచి సేకరించిన మట్టిని విద్యార్థుల సమక్షంలో అమృత కలశంలో వేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువతలో సమైక్య భావన, దేశ భక్తిని పెంచే విధంగా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఎంతో పవిత్ర భావంతో జాతీయ సేవా పథకం యూనిట్ల నుంచి వివిధ ప్రాంతాల నుంచి మట్టిని సేకరించి, దేశ రాజధానికి పంపుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శైలజ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



గురుకులంలో విద్యార్థులు, డ్రాయింగ్ ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న డీసీ రూపావతి

ఆరిలోవ: పూణేలోని కళాభారతి వైల్డ్ ఆర్ట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గురుకుల విద్యార్థులకు ఇటీవల జాతీయ స్థాయి ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఆర్ట్స్ అండ్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడిని శుక్రవారం గురుకులాల జిల్లా సమన్వయకర్త కంబాల రూపావతి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 65 మంది గురుకుల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వారు వేసిన పెయింటింగ్స్‌ను ఆన్‌లైన్ కళాభారతి వైల్డ్ ఆర్ట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించామని తెలిపారు. ఏడో తరగతి విద్యార్థి విజయ్, ఎనిమిదో తరగతి విద్యార్థి స్టీవ్‌ సన్, తొమ్మిదో తరగతి విద్యార్థి లోకేష్, పదో తరగతి విద్యార్థి రాజ్‌కుమార్ ప్రతిభ కనబరిచి, కళా గౌరవ పురస్కారం దక్కించుకున్నారు. మిగతా 61 మంది విద్యార్థులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లు లభించాయి. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆర్ట్స్ ఉపాధ్యాయుడు పి.సుధాకర్‌కు కళా భూషణ్ అవార్డు లభించిందన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.


బహుభాషా కోవిదుడు జోస్యుల సూర్యప్రకాశరావు



జోస్యుల చిత్ర పటానికి పూలమాలల వేసి నమస్కరిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగంలో ఆచార్య జోస్యుల సూర్యప్రకాశరావు సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సీనియర్ ఆచార్యులు జి.యోహాన్‌బాబు మాట్లాడుతూ ఆచార్య జోస్యుల సూర్యప్రకాశరావు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి వార్డెన్‌గా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్‌గా పని చేసి గుర్తింపు పొందారన్నారు. జోస్యుల బహుభాషాకోవిదులని, దాదాపు 12 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరన్నారు. సంస్కృతం, తెలుగు భాషలతో పాటు హిందీ లోను సాధికారంగా పట్టు సాధించిన జోస్యుల మంచి సాహిత్యాన్ని సృష్టించారన్నారు. నవ సాహితి ఇంటర్నేషనల్ చెన్నై సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ గురువులను స్మరించుకోవడం వారి మీద ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుందన్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు ఆచార్యులు జి.సీతారత్నం, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ బి.వెంకటస్వామి, డాక్టర్ ఆర్.రత్నశేఖర్, డాక్టర్ పి.లావణ్య, ఎ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంతోనే కేంద్రానికి గుణపాఠం



శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతోనే కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా గుణపాఠం నేర్పుతామన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 974వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వారికి అప్పగించాలన్న లక్ష్యానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలని చూస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి ఉక్కు యాజమాన్యంతో కలిసి విధ్వంసకర చర్యలు చేపట్టారని, సంస్థలో ప్రధాన విభాగాలను పాక్షికంగా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఉక్కు ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా వెల్లడవుతున్నాయి. దీనికి మద్దతుగా కార్మికులంతా పెద్ద ఎత్తున ఉక్కు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.